# అభానం

అత్తలూరి శోభారాణి



పట్నానికి చివరలో ఉన్న కాలనిలో అది నాలుగు కాపరాల లోగిలి. ఇంకా పల్లె వాతావరణం మాసిపోలేదు. లోగిలి పెరట్లో గిలకల బావి ఉంది. ఇంటి యజమాని శంకరం బావిని పూడ్చివేయాలని ఎన్నోసార్లు అనుకున్నాడు. మూడు రోజులకు ఒకసారి వచ్చే పంపునీళ్ళు ఇంటి అవసరాలకు సరిపోవు. ఎంచేతో ఆ పని ముడిపడలేదు.

ఉదయాన్నే నీళ్ళ కోసం వచ్చిన అనసూయమ్మ బావిలో చేద వేసి కరెంటు షాకు తగిలిన కాకిలా "శవం... శవం... శ..." అంటూ అరవసాగింది.

అప్పుడే తలుపు తీసుకొని పాలకోసం బయటకు వస్తున్న శంకరం భార్య సుందరి డెభై ఏళ్ళ అనసూయమ్మ "శివ... శివా.... శవం... శవం..." అంటుందో అర్థంకాక " ఏమిటి పిన్నీ? అంది.

"శవమే... శవమే పిల్లా! బావిలో శవం... శవం" అంటూ వణికిపోసాగింది అనసూయమ్మ. బావిలోకి తొంగిచూసి "ఏదో! ఏడాదిలోపులా ఉంది, మీ అబ్బాయిని పిలుస్తాను" లోపలకు పరుగెత్తింది సుందరి.

నాలుగు ఇళ్ళల్లోని ఆడా మగా బావి చుట్టూ చేరారు.

"బావి మీద జల్లెడ పెట్టించరా అంటే విన్నావు కాదు. ఇప్పుడు చూడు..." అంటూ తన ఉక్రోశం వెళ్ళబుచ్చింది శంకరం తల్లి సుభద్రమ్మ.

"ఊళ్ళో బావులు లేనట్టు, మన బావే దొరికిందా?" అని దీర్ఘం తీసింది కానిస్టేబులు మస్తాన్ భార్య రజియా.

"శంకరం! ఎందుకు వచ్చిన గోల కాని, బావిలో బక్కెట్లు తీసే ఓబుల్ని పిలిస్తే క్షణంలో బయట పడేస్తాడు" అన్నాడు చిల్లరకొట్టు వీరస్వామి.

ఒరే! రాఘవా! నా సైకిలు తీసుకొని ఆ ఎత్తు రోడ్డు మీద ఉండే ఓబుల్ని పిలుచుకురా!" పని పురమాయించాడు శంకరం.

మగవాళ్ళు బావి పళ్ళెం మీద కూర్చున్నారు. వాళ్ళకు కొంచం దూరంగా నిలబడి ఆడవాళ్ళు పంచాయితి మొదలుపెట్టారు.

"అక్కా! అది నిజంగా శవమేనా? సరిగా చూసావా?"అంది నాగమణి అనుమానంగా.

"ఉండండి నేను చూసి వస్తా" అంటూ బావి దగ్గరకు వెళ్ళి తొంగి చూసి "అబ్బే! అది శవం కాదు నాలుగో, ఐదో నెలల పిండం" కళ్ళకున్న కళ్ళజోడు సరిచేసుకుంటూ సరోజ అంది.

"నాలుగో నెల నుండే అవయవాలు ఏర్పడతాయి. అవి తీసి పడేసారా?"

"కడుపో, కాలో వస్తే ఆసుపత్రులు ఉన్నాయిగా!"

"అంతదాకా ఎందుకూ? రాకుండానే మాత్రలు ఉన్నాయిగా?"


"ఏం శవమో? ఏమిటో? అంతా మాయ"

"బ్రహ్మంగారు ముందే చెప్పారు"

"ఏమనీ? బావిలో శవాలు గుండ్రంగా ఉంటాయనా?" వెంటకారంగా అంది కమల.

"చిన్నగా మాట్లాడండి మగవాళ్ళు వింటే బాగుండదు"

"బండారం అంతా బయట పడ్డాక, బాగుండకపోవడం ఏమిటి?"



"మన చుట్టు పక్కల కడుపుతో ఉన్నవాళ్ళు ఎవరూ లేరు. పిల్లలా! అంతా పది పన్నెండు ఏళ్ళలోపువాళ్ళే. ఎవరో కొత్తవాళ్ళు చేసి ఉంటారు ఈ పని" అందరిని పరికించి చూస్తూ అంది అంగన్‌వాడి కార్యకర్త శ్రీలక్ష్మి.

"నిజమే! ఆడపిల్ల అని ఇలా చేసారేమో"

"చివరకు ఆడవాళ్ళకు పిల్లల్ని కనే హక్కు కూడా లేకుండా చేస్తున్నారు"

"మన స్త్రీలలోనే ఐక్యత లేదు"

"అవును"- ఎవరికి తోచినట్లు వాళ్ళు మాట్లాడుతూనే ఉన్నారు. రాఘవ సైకిలు వెనక ఓబుల్ని ఎక్కించు కొని వచ్చాడు. వాళ్ళవెనుక ఓబులు అసిస్టెంటు గాలం, తాళ్ళు పట్టుకొని రొప్పుకుంటూ వచ్చాడు ఓబుల్ని చూడగానే జనానికి ప్రాణం వచ్చినట్లు అయింది.

దూరంగా వస్తున్న కానిస్టేబులు మస్తాన్ చూసి "శంకరం! మస్తాన్ కూడా వస్తున్నాడు భయం లేదులే" ధైర్యం చెప్పాడు వీరాస్వామి. బావిచుట్టూ చేరిన జనాన్ని చూసి "ఏం జరిగింది?" అని ఆరా తీసాడు కానిస్టేబుల్ మస్తాన్.

బావిలో ఏదో చిన్న పిల్లాడి శవం. అసలే శంకరం భయస్తుడు కేసు అది అని భయపెట్టకు... ఓబుల్ని కూడా భయపెట్టకు" గబగబా తనకు తోచినట్లు చెప్పాడు గోవిందరావు.

"మరి! బావిలో శవం తియ్యాలంటే... మందు... మం...దు ఏసుకోవాల దానికి డబ్బులు ఇస్తే..." తల గీరుకుంటూ ఓబులు గొణిగాడు.

"ఈ వంద తీసుకొని పోయిరా!" అని వంద నోటు ఓబులు చేతిలో పెట్టాడు శంకరం. బావిలో శవం అని తెలిసి గంట పైగా అయింది. ఒక్కరన్నా బావిలోకి తొంగిచూసినవాళ్ళు లేరు. ఇదిగో పులి అంటే అదిగో తోక అని మాట్లాడుకుంటున్నారే కాని, ఓబులు మందు తాగి వచ్చి తాళ్ళు కట్టుకొని బావిలోకి దిగాడు. బావి అంతా కలయతిరిగి "ఏం లేదు బాబూ" అన్నాడు.

"ఏం లేకపోవడం ఏమిటీ? అదిగో, నీళ్ళపై తేలుతుందిగా?"

"ఏదో మరి మెత్తగా జారిపోతుంది"

"ఏదో ఒకటి బక్కెట్లో వెయ్యి" అరిచారు ఎవరో బయట నుండి.

"జారిపోతోంది... మెత్తగా ఉంది... గుండ్రంగా ఉంది" అంటూ గొణుగుతూ ఓబులు దాన్ని పట్టి బక్కెట్లో వేసాడు. పైకి వచ్చిన బక్కెటును నేలపై బోర్లించి చిన్న పుల్లతో అటూ ఇటూ కదిలించి "ఏం లేదు. అదేదో మాంసం ముద్ద" అన్నాడు కానిస్టేబుల్ మస్తాన్.

"ఏ కాకో తెచ్చి పడేసి ఉంటుంది నీళ్ళలో నాని అలా ఉబ్బింది"

"ఏమైనా! గంగమ్మను శుద్ధి చేయాలి"

మళ్ళీ జనం మాటలు మొదలు అయ్యాయి. ఇంత గందరగోళం జరుగుతున్నా డాబా గదిలోఉంటున్న సుబ్బారావు కనపడకపోయేసరికి రాఘవ పరుగెత్తుకుంటూ డాబా ఎక్కి సుబ్బారావును పిలుచుకువస్తూ జరిగినది అంతా వివరించాడు. నేల మీద ఉన్నదానికి చూడగానే సుబ్బారావుకు నవ్వు వచ్చింది. విషయం అర్థమైయింది. నోరు జారితే వీపు విమానం మోత మోగుతుంది. రాత్రి రెండో ఆట సినిమాకు వెళ్ళాలన్న హడావుడిలో స్నానం చేస్తూ చేయి జారిపడిన సబ్బు దాని పరిణామం ఇలా అవుతుందని అనుకోలేదు.

•